కంటికి రెప్పలా సంరక్షణ

పచ్చదనం పరిరక్షణకు ఆంధ్ర విశ్వవిద్యాలయం విశేష కృషి చేస్తోంది. విరివిగా మొక్కలు నాటి సంరక్షించే బాధ్యతలు చేపడుతోంది. ఇప్పటికే వర్సిటీ నార్త్, సౌత్ క్యాంపస్‌లలో పలు ప్రాంతాల్లో వర్సిటీ అధికారులు మొక్కలు నాటి సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు. కంటి తుడుపుగా మొక్కలు నాటి వదిలేయకుండా కంటికి రెప్పలా సంరక్షిస్తున్నారు. నాటిన మొక్కల చుట్టూ టీ గార్డులు ఏర్పాటు చేయడం, నిత్యం నీరుపోసి సంరక్షించడం వంటి చర్యలు చేపడుతున్నారు.

– ఏయూ క్యాంపస్

- ఏయూ ప్రాంగణాల్లో విస్తారంగా మొక్కల పెంపకం
- ప్రణాళికాబద్ధంగా పరిరక్షణకు అధికారుల కృషి



పర్యావరణ దినోత్సవం రోజున మొక్కను నాటుతున్న వీసీ ప్రసాదరెడ్డి(ఫైల్)



రహదారి పక్కనే వరుసగా నాటిన మొక్కలు

విశాఖ నగరం మధ్యలో అతిపెద్ద ప్రాణవాయు కేంద్రంగా ఆంధ్ర విశ్వవిద్యాలయం నిలుస్తోంది. ఇక్కడ ఉన్న వృక్ష వైవిధ్యత మరెక్కడా మనకు కనిపించదు. గతంలో హుద్‌హుద్ సమయంలో అనేక వృక్షాలు నేలకూలాయి. వర్సిటీలో మళ్లీ ఆ పచ్చదనం చేకూరాలన్న ఆలోచనతో పాలకులు నేడు పనిచేస్తున్నారు. దీనిలో భాగంగా భవిష్యత్ నిర్మాణాలు, అభివృద్ధి కార్యక్రమాల సమయంలో చెట్లకు ఎటువంటి నష్టం కలగకుండా ఉండేలా మొక్కలు నాటి పెంచే ప్రణాళిక సిద్ధం చేశారు. ఈ మేరకు వర్సిటీలోని ప్రధాన రహదారులను ఆనుకుని మొక్కలు నాటారు. కొద్దిరోజుల క్రితం వందకు పైగా మొక్కలను ఏయూ ఇంజనీరింగ్ కళాశాల మైదానం చుట్టూ నాటారు. త్వరగా పెరిగే విధంగా రెండు నుంచి మూడు సంవత్సరాల వయసు కలిగిన పెద్ద మొక్కలు నాటడం విశేషం.

నీడనిస్తూ.. పక్షులకు ఆవాసం

వర్సిటీలో చెట్లను ఆధారంగా చేసుకుని అనేక జాతుల పక్షులు నివాసం ఉంటాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని వర్సిటీలో విభిన్న జాతుల వృక్షాలను నాటుతున్నారు. ఇప్పటికే వేప, ఉసిరి, కదంబ, మారేడు, రావి, పారిజాతం, దేవకాంచన, గానుగ, పనస, రామాఫలం, ఆకాశమల్లి, జమ్మి, కాగు వంటి మొక్కలు వర్సిటీలో ప్రధాన రహదారులను ఆనుకుని నాటారు. ఇవి ఏపుగా పెరిగి నీడను ఇవ్వడంతో పాటు పక్షులకు ఆవాసంగా మారనున్నాయి.

సంరక్షణే ప్రధానం

వర్సిటీలోకి ప్రవేశం కోసం అనేక మార్గాలు ఉన్నాయి. దీంతో పరిసర ప్రాంతాల నుంచి పదుల సంఖ్యలో పశువులు వర్సిటీలోకి రావడం మొక్కలను తినేయడం తరచూ జరుగుతోంది. వర్సిటీ అధికారులు నాటిన మొక్కలను సంరక్షించడం పెద్ద సవాలుగా మారుతోంది. దీనిని దృష్టిలో ఉంచుకుని నాటిన ప్రతి మొక్క సంరక్షణ కోసం టీ గార్డును ఏర్పాటు చేశారు. మొక్కలకు నిత్యం నీటిని పోస్తూ వేసవి కాలంలో ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. వర్షాకాలం ఆరంభంలో మరిన్ని మొక్కలు నాటేందుకు అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు.



ఇంజనీరింగ్ కళాశాలలో మొక్కలకు నీరు పోస్తున్న సిబ్బంది

వృక్షాలు పెంచడం లక్ష్యం

వర్సిటీలో విరివిగా వృక్షాలను పెంచడం లక్ష్యంగా పనిచేస్తున్నాం. విభిన్న జాతుల మొక్కలను నాటి, వాటిని సంరక్షించడం కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నాం. నిత్యం నీరు అందిస్తూ వాటిని పరిరక్షిస్తున్నాం. నాటిన ప్రతి మొక్కను కంటికిరెప్పలా కాపాడే బాధ్యతను సిబ్బంది సహకారంతో చేపడుతున్నాం.

– డాక్టర్ జి.వీర్రాజు, డీన్, ఏయూ శానిటేషన్–బ్యూటిఫికేషన్

క్లుప్తంగా

బాలుడు అదృశ్యం



మహ్మద్ అర్మాన్(ఫైల్)

ఆరిలోవ: ఓ బాలుడు అదృశ్యమైన ఘటనపై ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. జీవీఎంసీ 13వ వార్డు పరిధి ఆపరేషన్ కాలనీకి చెందిన 13 ఏళ్ల మూగ బాలుడు మహ్మద్ అర్మాన్ ఈ నెల 2న సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. అదే రోజు గిరి ప్రదక్షిణ కావడంతో బీఆర్‌టీఎస్‌లో భక్తులతో కలిసిపోయి ఎటో వెళ్లిపోయాడు. తిరిగి ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికినా బాలుడి ఆచూకీ తెలియలేదు. దీంతో బాలుడు తల్లి శేఖ ఖాతర్ ఫిర్యాదు మేరకు ఆరిలోవ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

పిఠాపురం కాలనీలో ఘనంగా గురుపౌర్ణమి



ప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న సభ్యులు

మద్దిలపాలెం : జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీలోని షిర్డీసాయి ధ్యాన మందిరంలో మంగళవారం గురుపౌర్ణమి ఘనంగా జరిగింది. ఇందులో భాగంగా ఆలయ ధర్మకర్తలు డాక్టర్ పి.వి.ప్రసాద్, సరోజిని దంపతులను భక్త బృందం సభ్యులు సత్కరించారు. గురువు పూజ చేశారు. మధ్యాహ్నం మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆరిలోవ: విమ్స్ సబ్ స్టేషన్ పరిధిలో 11 కేవీ రెవెన్యూ కాలనీ ఫీడర్‌లో విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో సరఫరా నిలిపివేయనున్నారు. ఈ మేరకు విశాలాక్షినగర్, రెవెన్యూకాలనీ, కో–ఆపరేటివ్ బ్యాంక్ ప్రాంతం, షిరిడీ సాయి వెటర్నరీ కాలనీ, నాటుకోళ్ల రోడ్డు, తదితర ప్రాంతాలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏపీ ఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ పి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

వన్ ప్లస్ రోడ్ ట్రిప్‌కు విశేష స్పందన



వన్ ప్లస్ సమాచార వాహనాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

ఎంవీపీ కాలనీ: స్థానిక సమత కళాశాల వద్ద మంగళవారం వన్ ప్లస్ మొబైల్స్ సంస్థ ఏర్పాటు చేసిన వన్ ప్లస్ రోడ్ ట్రిప్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. సమాచార వాహనం ద్వారా వన్ ప్లస్‌కు చెందిన టాబ్స్, సెల్‌ఫోన్లు, వాటికి ఉపయోగిస్తున్న అధునాతన సాంకేతికతపైన సంస్థ ప్రతినిధులు విద్యార్థులకు అవగాహన కల్పించారు. సాంకేతిక అంశాల్లో క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సంగీత కార్యక్రమం అలరించింది.

అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా అధ్యక్షులకు సత్కారం



మజ్జి ప్రసాద్, డి.వి.ఎస్.ఎన్.రాజును సత్కరిస్తున్న ఉద్యోగులు

మద్దిలపాలెం: ఏపీ పబ్లిక్ హెల్త్ అండ్ మున్సిపల్ ఇంజినీరింగ్ డిపార్ట్‌మెంట్ నాన్ టెక్నికల్ ఎంప్లాయిస్ రాష్ట్ర అధ్యక్షుడు మజ్జి ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు డి.వి.ఎస్.ఎన్.రాజులను మంగళవారం హెచ్‌బీ కాలనీలోని కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ముఖ్య కార్యదర్శి వై.శ్రీలక్ష్మి సుముఖత వ్యక్తం చేసేలా కృషి చేసినందుకు వారికి కృతజ్ఞతలు తెలుపుతూ సంఘం సభ్యులు ఈ సన్మానం చేశారు.

ప్రజల చెంతకు ప్రభుత్వ సేవలు



15వ వార్డులో ధ్రువ పత్రాలు అందిస్తున్న అక్కరమాని విజయనిర్మల, కార్పొరేటర్ శ్రీవిద్య



23వ వార్డులో ధ్రువ పత్రాలు అందిస్తున్న విజయనిర్మల, కార్పొరేటర్ గుడ్ల విజయసాయి

- వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల
- 'జగనన్న సురక్ష'లో పలు ధ్రువ పత్రాల అందజేత

మద్దిలపాలెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంకల్పం కారణంగా ప్రజల చెంతకు ప్రభుత్వ సేవలు సులభంగా చేరుతున్నాయని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల తెలిపారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జీవీఎంసీ 15వ వార్డులో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురికి వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 11 రకాల ధ్రువీకరణ పత్రాలను ఇంటి వద్దనే దరఖాస్తులు స్వీకరించి, మంజూరు చేయడం గొప్ప విషయమన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల కోసం గతంలో కార్యాలయాల చుట్టూ తిరిగాల్సిన పరిస్థితి ఉండేదని, జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు ఆ కష్టాలు తప్పాయన్నారు. కార్పొరేటర్ అప్పారి శ్రీవిద్య మాట్లాడుతూ 416 మందికి పలు ధ్రువ పత్రాలు అందించామన్నారు. తహసీల్దార్ ఆనందకుమార్ మాట్లాడుతూ 546 మంది దరఖాస్తులు చేసుకున్నారని, తొలి విడతగా 416 మందికి ధ్రువ పత్రాలు అందజేశామని, మిగతా 130 మందికి త్వరలో మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీడీవో దుర్గాప్రసాద్, స్పెషల్ ఆఫీసర్ శోభన్, మున్సిపల్ కౌన్సిల్ సభ్యుడు అప్పారి గిరిబాబు, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకుడు పీలా వెంకట్, కన్వీనర్లు, తదితరులు పాల్గొన్నారు.

23వ వార్డులో..

జగనన్న సురక్ష కార్యక్రమం సంక్షేమ పథకాలు పొందే లబ్ధిదారులకు, పాఠశాలల్లో చేరే విద్యార్థులకు శ్రీరామరక్షగా నిలిచిందని వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమాన్ని జీవీఎంసీ 23వ వార్డులో మంగళవారం నిర్వహించారు.

పలువురు లబ్ధిదారులకు వివిధ రకాల ధ్రువీకరణ పత్రాలు అందించారు. అనంతరం అక్కరమాని మాట్లాడుతూ 11 రకాల ధ్రువీకరణ పత్రాల కోసం వలంటీర్లు ఇంటి వద్దకే వెళ్లి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారన్నారు. ఇలాంటి బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మన్ననలు పొందుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ గుడ్ల విజయసాయి, ఏపీడీవో దుర్గాప్రసాద్, స్పెషల్ ఆఫీసర్ శోభన్, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గుడ్ల సత్యారెడ్డి, సచివాలయ సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

9న ములాయం సింగ్ విగ్రహావిష్కరణ

మద్దిలపాలెం : సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు, దివంగత నేత ములాయం సింగ్ యాదవ్ విగ్రహావిష్కరణ ఈ నెల 9న గుంటూరు జిల్లా కాజా టోల్‌ప్లాజా వద్ద జరగనుందని జిల్లా యాదవ్ సంఘం సభ్యులు తెలిపారు. ఈ మేరకు పోస్టర్‌ను సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఒమ్మి సన్యాసిరావు, మొల్లి అప్పారావు, గొంపా అప్పారావు, ఉపాధ్యక్షుడు యడ్ల సుమన్ ఆవిష్కరించారు. విగ్రహావిష్కరణకు యాదవ సంఘం ప్రతినిధులు హాజరుకావాలని వారు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ సుభాస్ చంద్రబోస్, మెట్టా శ్రీనివాసరావు, తాతారావు, దువ్వి మంగరాజు పాల్గొన్నారు.

ఏయూ సమాచారం

సైన్స్ కళాశాల విద్యార్థులకు సాఫ్ట్‌వేర్ కొలువులు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సైన్స్ కళాశాల విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు సాధించారు. డిజిఫాక్ సంస్థలో ఏయూ స్టాటస్టిక్స్ విభాగం విద్యార్థులు ఐదుగురు, కెమికల్ ఇంజినీరింగ్ విద్యార్థి ఒకరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మంగళవారం సాయంత్రం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సమక్షంలో డిజిఫాక్ సంస్థ సీఈవో అమర్‌రాజ్ విద్యార్థులకు నియామక పత్రాలు అందజేశారు. ప్రారంభ వార్షిక వేతనంగా రూ.4లక్షలు అందుకోనున్నారు. వర్సిటీ విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పిస్తున్న డిజిఫాక్ సంస్థను వీసీ అభినందించారు.



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులతో వీసీ ప్రసాదరెడ్డి

అల్లూరి జీవితంపై డాక్యుమెంటరీ

ఏయూ క్యాంపస్: అల్లూరి సీతారామరాజు జీవితంపై విశ్రాంత పోలీసు ఉన్నతాధికారి డాక్టర్ కె.సత్యనారాయణ అధ్యయనం చేసి తీర్చిదిద్దిన డాక్యుమెంటరీని ఏయూ వీసీ ప్రసాదరెడ్డి సమక్షంలో ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రీసెర్చ్(ఐసీసీఆర్) డైరెక్టర్ జనరల్ కుమార్ తుహిన్ ఆవిష్కరించారు. అల్లూరి జీవితంలో జరిగిన వివిధ సంఘటనలను సమగ్రంగా దీనిలో వివరించే ప్రయత్నం చేశారు. ఈ డాక్యుమెంటరీని యూట్యూబ్‌లో అందుబాటులో ఉంచారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు, ఎన్.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పోరాట యోధుడు అల్లూరి



ప్రభుత్వ బాలుర గృహంలో అల్లూరి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న డీసీపీ నాగేంద్ర



ఏయూలో అల్లూరి విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ మాధవ్ తదితరులు



కృష్ణా కళాశాలలో అల్లూరి చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

ఆరిలోవ: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు పోరాటం స్ఫూర్తిదాయకమని, దేశానికి ఆయన చేసిన సేవలు మరువరానివని డీసీపీ క్రైం నాగేంద్ర కొనియాడారు. మంగళవారం ఆరిలోవ ప్రాంతం దీన్‌దయాల్‌పురం వద్ద ప్రభుత్వ బాలుర గృహాన్ని సందర్శించారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా విద్యార్థులతో కలిసి అల్లూరి చిత్ర పటానికి డీసీపీతో పాటు ఏపీపీ బి.ప్రమీల, గృహం సూపరింటెండెంట్ వీరయ్య నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు ఎంతో క్రమశిక్షణ కలిగిన వ్యక్తి అని తెలిపారు.

- జూ పార్కు గేటు వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో జూ సిబ్బంది అల్లూరి జయంతి నిర్వహించారు. సీఐటీయూ నాయకులు, కార్మికులు ఇక్కడ అల్లూరి చిత్రపటానికి పూలు చల్లి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆర్.కె.ఎస్.వి.కుమార్, కె.సత్యనారాయణ, జూ కార్మికులు పాల్గొన్నారు.
- జీవీఎంసీ 13వ వార్డు రామకృష్ణాపురంలో బీఆర్‌టీఎస్ పక్కన ఉన్న అల్లూరి విగ్రహానికి ఆరిలోవ సీపీఐ జోన్, ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల నాయకులు ఎ.విమలకుమారి, కె.లక్ష్మణరావు, సీహెచ్ కాసుబాబు, కె.సందీప్‌కుమార్ పాల్గొన్నారు. జీవీఎంసీ 9, 10, 11, 12, 13 వార్డుల టీడీపీ నాయకులు కూడా అల్లూరికి అంజలి ఘటించారు.

'అల్లూరి జీవితం సమగ్రంగా అధ్యయనం'

ఏయూ క్యాంపస్: స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు జీవితాన్ని సమగ్రంగా అధ్యయనం చేయాలని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సూచించారు. అల్లూరి జయంతి సందర్భంగా ఏయూ న్యాయ కళాశాల వద్దనున్న అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. అనంతరం సెంటర్‌ఫర్ అల్లూరి సీతారామరాజు చరిత్ర, ఆదివాసి అధ్యయన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వీసీ మాట్లాడారు. అల్లూరి జీవితం, త్యాగం, ధీరత్వం, స్వాతంత్య్ర పోరాటంలో పడ్డ కష్టాలు నిశితంగా పరిశీలించే ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్.మాధవ్, రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, కేంద్రం సంచాలకుడు ఆచార్య వి.విజయలక్ష్మి, వర్సిటీ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు, ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కృష్ణా కళాశాలలో..

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా కళాశాలలో అల్లూరి చిత్రపటానికి ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, అధ్యాపకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, ఐక్యూ ఏసీ కో ఆర్డినేటర్ కె.రవిబాబు, ఎన్ఎస్ఎస్ అధికారులు రత్నభారతి, ఉమామహేశ్వరరావు, సుధీర్, తదితరులు పాల్గొన్నారు.



రామకృష్ణాపురం వద్ద అల్లూరి విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న సీపీఐ నాయకులు

జూనోసిస్ వ్యాధులపై అవగాహన అవసరం



తోటగరువు పశు వైద్యశాలలో పెంపుడు కుక్కకు టీకా వేస్తున్న ఏడీ డాక్టర్ శ్రీనివాసరావు(ఫైల్)

ఆరిలోవ: జూనోసిస్ వ్యాధులపై ప్రతి ఒక్కరికీ అవగాహన అవసరమని పశు వైద్య విభాగం చినగదిలి మండలం ఏడీ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు అన్నారు. ఈ నెల 6న ప్రపంచ జూనోసిస్ డేను పురస్కరించుకుని ఆయన మంగళవారం 'సాక్షి'తో మాట్లాడారు. జూనోసిస్ డే సందర్భంగా తోటగరువులో పశువైద్యశాలతో పాటు చినగదిలి మండలంలో అన్ని పశువైద్యశాలల్లోను పెంపుడు కుక్కలకు ఉచిత వ్యాక్సిన్ వేయనున్నామన్నారు. కుక్కలకు రేబిస్ టీకా వేస్తే.. అవి మనుషులను కరిచినా ఎలాంటి ప్రమాదం ఉండదన్నారు. పిచ్చి కుక్క లాలాజలంలో రేబిస్ కారక వైరస్ ఉంటుందని, ఇది కరిచిన మనిషికి నరాలలోకి కుక్క లాలాజలం చేరి, అలా మెదడుకు వ్యాపిస్తుందని చెప్పారు.

కరిచిన భాగాన్ని బట్టి వైరస్ మెదడకు చేరడానికి 7 రోజుల నుంచి ఒక సంవత్సరం వరకు పడుతుందన్నారు. ఆ మధ్య కాలంలో మనిషి మరణించే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. అందుకే కుక్క కరిచిన వెంటనే రేబిస్ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. నెల రోజుల్లో తప్పనిసరిగా ఐదు డోసులు వేయాల్సి ఉంటుందన్నారు. చినగదిలి మండలంలో 2,546 కుక్కలున్నాయని, వాటిలో 1211 పెంపుడు కుక్కలు కాగా, 1335 వీధి కుక్కలు ఉన్నట్లు గుర్తించామన్నారు. జూనోసిస్ డే సందర్భంగా తోటగరువులో గురువారం ఉదయం 9 గంటల నుంచి కుక్కలకు వ్యాక్సిన్ వేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పెంపుడు కుక్కల యజమానులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఆర్‌ఐవో కార్యాలయం ఎదుట విద్యార్థుల నిరసన



నిరసన తెలుపుతున్న కృష్ణా కళాశాల విద్యార్థులు

మద్దిలపాలెం : కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యూనిఫాం పేరిట ఒత్తిడికి గురిచేస్తున్నారంటూ విద్యార్థులు మంగళవారం పిఠాపురం కాలనీలోని ఆర్ఐవో కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. ఏఐడీఎస్‌వో నగర కార్యదర్శి సంతోష్ మాట్లాడుతూ ప్రథమ సంవత్సరం విద్యార్థులు తప్పనిసరిగా యూనిఫాం వేసుకోవాలని ప్రిన్సిపాల్ ఒత్తిడి చేస్తున్నారని విమర్శించారు. అలాగే యూనిఫాంను తాము సూచించిన షాప్‌ల వద్ద మాత్రమే కొనుగోలు చేయాలని చెబుతున్నారని ఆయన ఆరోపించారు. అనంతరం ఆర్ఐవోకు వినతిపత్రం అందజేశారు.

90 ఏళ్ల గురువుకు పాదాభివందనం

మద్దిలపాలెం: గురుపౌర్ణమిని పురస్కరించుకుని 90 ఏళ్ల వయస్సు ఉన్న గురువుకు శిష్యులు పాదాభివందనం చేసి గురుభక్తిని చాటుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. మద్దిలపాలెంలోని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 1979–82 విద్యా సంవత్సరంలో పలువురు బీఎస్సీ(మ్యాథ్స్) చదువుకున్నారు. అప్పట్లో మ్యాథ్స్ లెక్చరర్‌గా ఎస్.ఎ.రెహమాన్ పని చేసేవారు. ఆయన బోధన, సూచించిన భవిష్యత్ సూత్రాలు తమ బంగారు భవిష్యత్‌కు బాటలు వేసాయంటూ వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన ఆ బ్యాచ్ విద్యార్థులు గురువు రెహమాన్, బేగం దంపతులకు పాదాభివందనాలు చేసి గురుపూజోత్సవం చేశారు. భానునగర్ కాలనీలోని రెహమాన్ ఇంటికి వెళ్లి మీరు చూపిన బాటాలో నడిచి ఉన్నత శిఖరాలు అధిరోహించామంటూ కృతజ్ఞతలు తెలిపారు. ఈ వేడుకలో పూర్వ విద్యార్థులు కుప్పిల గణేష్‌పాత్రో, డాక్టర్ రవీంద్రనాథ్, పి.వి.ఆర్.ప్రసాద్, వి.నాగేశ్వరరావు, సిహెచ్.వి.అప్పారావు, టి.ఆనందరావు, ఎస్.ఎస్.వి.వి.ఎస్.ఎస్.మూర్తి, ఎస్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.



గురువు ఎస్.ఎ.రెహమాన్ దంపతులను సత్కరిస్తున్న శిష్యులు

సబ్సిడీపై 4 టన్నుల టమాటా విక్రయం



ఎంవీపీ రైతుబజార్‌లో సబ్సిడీ టమాటా కోసం బారులు తీరిన వినియోగదారులు

ఆరిలోవ: సబ్సిడీ టమాటా కోసం ఎంవీపీ రైతుబజార్‌లో వినియోగదారులు రోజూ బారులు తీరుతున్నారు. టమాటా ధర విపరీతంగా పెరగడంతో రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులకు ఈ నెల 2 నుంచి రైతుబజార్లలో సబ్సిడీపై రూ.50కే కిలో టమాటా అందిస్తున్న విషయం తెలిసిందే. అప్పటి నుంచి ఎంవీపీ రైతుబజార్‌లో రోజూ టమాటాల కోసం క్యూలు కడుతున్నారు. మంగళవారం మరింత ఎక్కువ సంఖ్యలో వినియోగదారులు రావడంతో ఇక్కడ ఏర్పాటు చేసిన నాలుగు స్టాళ్లలో 4 టన్నుల టమాటాలు విక్రయించినట్టు రైతుబజార్ ఈవో జి.ప్రసాద్ తెలిపారు. ఇదిలా ఉండగా మార్కెటింగ్ శాఖ ఏడీ యాసిన్ రైతుబజార్‌ను సందర్శించి టమాటాల కోసం క్యూలో ఉన్నవారందరికీ సక్రమంగా అందుతున్నాయో లేదోనని ఆరా తీశారు. అనంతరం రైతుబజార్ ఆవరణలో నిర్వహిస్తున్న కంపోస్టు ఎరువు తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రస్తుతం ఇక్కడ పేరుకుపోయిన కూరగాయల వ్యర్థాలను తొలగించి శుభ్రం చేయాలని ఈవోను ఆయన ఆదేశించారు. మళ్లీ కంపోస్టు ఎరువు తయారు చేసేలా సిద్ధం చేయాలని సూచించారు.

జీవీఎంసీ కమిషనర్ విస్తృత పర్యటన



దత్ ఐల్యాండ్ ప్రాంతంలో సుందరీకరణ పనులు పరిశీలిస్తున్న కమిషనర్ సాయికాంత్‌వర్మ

డాబాగార్డెన్స్: జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ మంగళవారం నగరంలో విస్తృత పర్యటన చేశారు. సిరిపురంలోని దత్ ఐల్యాండ్, బీచ్ రోడ్డులోని స్విమ్మింగ్ పూల్, ఎంవీపీ, హనుమంతవాక జంక్షన్, హెచ్‌బీ కాలనీ, ఎన్జీవోస్ కాలనీ, మురళీనగర్, తదితర ప్రాంతాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ దత్ ఐల్యాండ్ ప్రాంతాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. బీచ్ రోడ్డులోని స్విమ్మింగ్ పూల్ పనులను పరిశీలించి, అధికారులకు తగు సూచనలు చేశారు. అనంతరం గిరి ప్రదక్షిణ మార్గంలో రోడ్లను పరిశీలించారు. పారిశుధ్య పనులు వేగవంతం చేయాలని సిబ్బందిని ఆదేశించారు. రోడ్లపై పేపర్ ప్లేట్లు అతుక్కుపోయాయని, వాటిని నీటితో తడిపి హెయిర్ ప్రెషర్‌తో తొలగించాలని సూచించారు. రహదారులు మునుపటి వలే ఆకర్షణీయంగా ఉండేలా చూడాలని జోనల్ కమిషనర్లను ఆయన ఆదేశించారు.